క్లుప్తంగా

22న పాతపట్నంలో శ్రీరామ పాదుకా పూజా మహోత్సవం

పాతపట్నం:పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న యెరుకొల ఆవరణలో ఈ నెల 22వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీరామ పాదుకా పూజా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శ్రీరామ సేవా సమితి సభ్యులు శుక్రవారం తెలిపారు. అయోధ్యలో శ్రీజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలరాముడు నూతన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శ్రీరామ పాదుకల ఊరేగింపు, కలశస్థాపన, శ్రీరామ రక్షాస్తోత్రం, ఆదిత్య హృదయం, హనుమాన్ చాలీసా, విజయ మహామంత్ర జపం, సామూహిక పారాయణం, హోమం, పూర్ణాహుతి, భజన కీర్తనలు ఉంటాయన్నారు.

తొగరాంలో సంకల్పయాత్ర



మాట్లాడుతున్న సూరపునాయుడు

ఆమదాలవలస రూరల్: తొగరాం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ సూరపునాయుడు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా నారీ సంకల్పశక్తిని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందన్నారు. ఈవోపీఆర్డీ గోవిందరావు, ఏపీఎం పైడి కూర్మారావు, వైద్యాధికారిణి మెట్ట శ్రవంతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులు బాధ్యతగా ఉండాలి



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న జయదేవి

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నందున సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, పోలింగ్ కేంద్రాల స్థితిగతులు పరిశీలించాలని రిటర్నింగ్ అధికారి జయదేవి అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో నియమించిన 33 మంది సెక్టార్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఇప్పటి నుంచే భాగస్వాములు కావాలని సూచించారు. అప్పగించిన బాధ్యతలు తెలుసుకొని సక్రమంగా ఆచరించాలని, ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ బాధ్యతగా పని చేయాలని కోరారు. నరసన్నపేట తహసీల్దార్ సింహాచలం పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



కంటిఅద్దాలను అందజేస్తున్న నోడల్ అధికారి ప్రసాదరావు

సారవకోట: జగనన్న సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ ఎం.ప్రసాదరావు సూచించారు. అంగూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పలువురికి కంటి అద్దాలను అందజేశారు. వైద్యులు సుజనీ కుమారి, సౌమ్య, దేవికలు రోగులకు వైద్య సేవలందించారు. మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

21న వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఆమదాలవలస: భారత ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా ఆదివారం స్థానికంగా జరుగనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని, సమగ్ర సమాచారాన్ని ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ప్రతి ఒక్కరినీ చైతన్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనజాగృతి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో జరుగనున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు, మహిళా స్వయంసహాయక సంఘాల సభ్యులు, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు: ఇరపాడు వద్ద గురువారం రాత్రి పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై ఎంఏ అహమ్మద్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.19,180 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని.. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

కులగణనకు శ్రీకారం

- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



పాతపట్నం: అచ్చుతాపురంలో సర్వే చేస్తున్న సచివాలయం ఉద్యోగి, వలంటీర్లు

పాతపట్నం:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన సర్వే ఊరూరా శుక్రవారం నుంచి ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి కులగణన సర్వే చేపట్టారు. అయితే శుక్రవారం ఉదయం నుంచే సర్వర్ బిజీగా ఉండి యాప్ మొరాయించడంతో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. పాతపట్నం మండలంలో సర్వేను ప్రారంభించామని ఎంపీడీవో జయంత్ ప్రసాద్ చెప్పారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో సర్వే ఆరంభమైందన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో కులగణన సజావుగా ప్రారంభమైంది. మండలంలో 25,905 కుటుంబాలు ఉండగా 74,052 మంది జనాభా ఉంది. వీరికి కులగణన చేసేందుకు 409 మంది వలంటీర్లకు బాధ్యతలు అప్పగించారు. ఉదయం నుంచి వలంటీర్లు తమకు అప్పగించిన బాధ్యతలను ఆరంభించారు. తొలిరోజున సాయంత్రం వరకూ 19 సచివాలయాల్లో 62 మంది వలంటీర్లు సర్వేని ప్రారంభించారని ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు. 140 కుటుంబాల్లో 290 మందికి సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన నాయకులు, ప్రజాప్రతినిధులు సర్వే తీరును పరిశీలించారు.

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ విధి విధానాల ప్రకారం సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఉమ్మడిగా సర్వే చేస్తున్నారు. సర్వేను స్థానిక ఈవోపీఆర్డీ కృష్ణారావు పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.

బూర్జ: మండలంలోని అన్ని పంచాయతీల్లో కులగణన సర్వే చేపడుతున్నట్టు ఎంపీడీఓ ఎం రవీంద్ర బాబు చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నట్టు చెప్పారు.

మెళియాపుట్టి: కులగణన సర్వే పారదర్శకంగా చేయాలని డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ అన్నారు. మండలంలో కులగనణ సర్వే నిర్వహిస్తున్న కొసమాల, పెద్దపద్మాపురం గ్రామ సచివాలయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే ద్వారా కులాల వివరాలు, ఇంట్లో ఎంతమంది ఉన్నారనేదానిపై సచివాలయ సిబ్బంది రూట్ మ్యాప్ ప్రాప్తికి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పెద్దపద్మాపురంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. ఎంపీడీవో చంద్రకుమారి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



బూర్జ: దొంకలపర్త గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది



మెళియాపుట్టి: పెద్ద పద్మాపురంలో సర్వేను పరిశీలిస్తున్న అలివేలు మంగమ్మ



నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధి కొత్తవీధిలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఈవో చిన్నారావు



కొత్తూరులో సర్వే చేస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చిరంజీవినాగ్
- కొత్తవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. కొత్తవలస గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు తమకు అందుతున్న పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవినాగ్ మాట్లాడుతూ.. అవినీతిరహితంగా పరిపాలన సాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. దేశం మొత్తం గర్వించే విధంగా సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నామని గుర్తు చేశారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారు. గత టీడీపీ పాలనలో పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, అర్హత ఉంటే పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట ఆనందరావు, ఉప సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కూటికుప్పల సన్యాసిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఏవో మోహనరావు, ఏపీఎం కూర్మారావు, ఏపీవో లక్ష్మీనరసమ్మ, వైద్యాధికారి శ్రవంతి, పంచాయతీ కార్యదర్శి హరీష్, పార్టీ నాయకులు గురుగుబెల్లి కొండలరావు, రాజు, నీలారావు, చిగురుపల్లి దశరథ, చేపాన కృష్ణ, తమ్మినేని వేణు, ఎన్ని రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు దూసిపేటలో..

దూసి గ్రామ సచివాలయం పరిధిలోని దూసిపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు స్పీకర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదలైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది.

ఎఫ్‌పీసీ పేదలకు వరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాజశేఖర్

బూర్జ: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేద ప్రజలకు వరం లాంటిదని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.రాజశేఖర్ అన్నారు. పెదలంకాం పంచాయతీ చిన్న లంకాం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి బీపీ, 23 మందికి సుగర్ 23, 20 మందికి జనరల్ తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ లఖినాన సరోజిని, ఏఎన్‌ఎం లత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవళిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిటకిటలాడిన రైళ్లు



సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చిన వారంతా ఇప్పుడు తిరిగి ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో బస్సులు, రైళ్లు కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. పాతపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్ రైలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఎక్కడానికి కూడా అవకాశం లేక ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పాతపట్నం రైల్వేస్టేషన్‌లో నిలిచే గుణుపూర్-పూరి, గుణుపూర్-కటక్, గుణుపూర్-విశాఖపట్నం, గుణుపూర్-పలాస పాసింజర్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. స్టేషన్ ఆవరణ ప్రయాణికులతో నిండిపోయింది.

పాతపట్నం

ప్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న వారిని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రీ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ పి.ఇ.ఎస్.పట్నాయక్ తెలిపారు. పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రీ పబ్లిక్ పరీక్షలను మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఎల్.ఎన్.పేట: వాహనదారులు రహదారి నియమాలను పాటించాలని సరుబుజ్జిలి మండలం ఇన్‌చార్జి ఎస్సై రఘునాథ్ సూచించారు. మండలంలోని రావిచెంద్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలను చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించే సమయంలో ప్రమాదాలు జరిగితే తలకు దెబ్బతగిలి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడపవద్దన్నారు. ఆటో యజమానులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. అనుమతి పత్రాలు లేకుండా వాహనాలను నడపితే చర్యలు తప్పవన్నారు. రహదారి నిబంధనలు పాటించపోతే అపరాధ రుసుం విధించటంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమగ్ర భూమి సర్వే పూర్తి చేయాలి



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న జనార్దనరావు

ఎల్.ఎన్.పేట: సమగ్ర భూమి రీసర్వేను వేగవంతం చేయాలని టెక్కలి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ అధికారి (డీఐఎస్‌వో) మామిడి జనార్దనరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సర్వే సిబ్బందితో సమావేశమయ్యారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఇంకా పూర్తి చేయాల్సిన రెవెన్యూ గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలను సూచించారు. సర్వే పూర్తి చేయటం వలన రైతులకు మేలు చేకూరుతోందన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

- ఎమ్మెల్యే కృష్ణదాస్
- నరసన్నపేటలో సంఘీభావ ర్యాలీ



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

నరసన్నపేట: ప్రపంచ మేధావుల్లో ఒకరైన బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ మన దేశ పౌరుడు కావడం గర్వకారణమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్మించి ప్రపంచంలో మన రాజ్యాంగం గొప్పతనాన్ని చాటిచెప్పారని గుర్తు చేశారు. అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సమాన ప్రాతిపదికన రాజ్యాంగ హక్కులను కల్పించిన మహనుభావుడని కొనియాడారు. విజయవాడలో శుక్రవారం జరిగిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంఘీభావంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. ఇంతటి మహోన్నత వ్యక్తిని ఇప్పటి వరకూ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, మొక్కుబడి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహన్ని ఏర్పాటుచేసి జాతికి అంకితం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాల ప్రకారం పాలన చేస్తూ ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. ఇన్నాళ్లకు ఆయనకు సముచిత స్థానం ఏపీలో దక్కిందన్నారు. భారీ విగ్రహావిష్కరణతో దేశం యావత్తూ ఏపీ వైపు చూస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు యూ.కేశవరావు, జయరాజ్, కె.ప్రవల్లిక ప్రియలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం, ఆయన ఆశయాల్లో గొప్పతనం గురించి వివరించారు. ఎన్నితరాలు మారినా దేశంలో ఆయన పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు, కణిత కృష్ణారావు, తంగుడు జోగారావు, తంగి మురళి, కనుసు సీతారాం పాల్గొన్నారు.

పక్కాగా కులగణన సర్వే

- జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి లక్ష్మీప్రసన్న



కులగణనను పరిశీలిస్తున్న లక్ష్మీప్రసన్న

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో చేపడుతున్న కులగణన సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిని వి.ఎస్.ఎస్.లక్ష్మీప్రసన్న సూచించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ప్రశ్నావళిని కుటుంబ సభ్యునికి చదివి వినిపించిన తరువాతనే తగు సమాచారం పూరించాలన్నారు. కుల ధ్రువీకరణ విషయంలో పూర్తి నిర్ధారణ తరువాత మాత్రమే సమాచారాన్ని పొందుపర్చాలన్నారు భవిష్యత్ సంక్షేమ పథకాల అమలులో, ప్రభుత్వ పౌర సేవలలో కులధ్రువీకరణ సర్వే సమాచారం కీలకం కానుందన్నారు. ఒక వ్యక్తి సమాచారం ధ్రువీకరణ చేసేటప్పుడు ఎటువంటి సమస్యలు వస్తున్నాయి, ఎంత సమయం పడుతుందో అడిగి తెలుసుకున్నారు. సర్వే చేటప్పుడు ఆధార్ ధ్రువీకరణలో తీవ్ర అవాంతరం కలుగుతోందని సర్వే సిబ్బంది ఆమెకు వివరించారు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, జిల్లా ఉప గణాంకాధికారి టి.అప్పారావు, స్థానిక సహాయ గణాంకాధికారి బి.గోవిందరావు ఉన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న నాయకులు

మెళియాపుట్టి: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు మహిళలకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయన్నారు. భారత దేశ చరిత్రలో ఏరాష్ట్రంలో లేనివిధంగా మహిళా సంక్షేమానికి అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. మహిళలు బాగుంటేనే రాష్ట్రం, గ్రామస్వరాజ్యం బాగుంటుందన్నారు. మండల కోఆప్షసభ్యుడు భాస్కరదాస్, మండల నాయకులు జయమునిరావు, శోభూషణ్ రావు, వార్డు మెంబర్లు మీసాల రామచంద్ర, పరపటి యోగీశ్వరరావు ఉన్నారు.

భీమిలి సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కృష్ణదాస్ పిలుపు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కృష్ణదాస్

పోలాకి: విశాఖ జిల్లా భీమిలిలో ఈనెల 25వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలాకి మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక సచివాలయం ఆవరణలో కేడర్‌తో సమావేశమై మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికల శంఖారావాన్ని ఉత్తరాంధ్ర నుంచే పూరించనున్నారని చెప్పారు. తొలి సభకు పెద్ద ఎత్తున కేడర్ హాజరు కావాలని కోరారు. నరసన్నపేట నియోజకవర్గం నుంచి నాలుగు మండలాలకు ప్రత్యేకంగా బాధ్యులను నియమించాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్యకు కృష్ణదాస్ సూచించారు. అన్నివర్గాలకు న్యాయం చేసిన ప్రభుత్వంగా, ప్రజల్లో ఆదరణ కలిగిన పార్టీకి వచ్చే ఎన్నికల్లో సైతం మద్దతుగా నిలవాలని కోరుతూ క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు ఉన్నారు.

బొడ్డగూడ పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: మండలంలోని దిమిలి పంచాయతీ పరిధి బొడ్డగూడ గిరిజన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ డి.చక్రవర్తి, ఎస్సై ఎంఏ ఆహమ్మద్‌లు శుక్రవారం పరిశీలించారు. ఎత్తైన కొండపై ఉన్న ఈ గిరిజన గ్రామంలో పోలింగ్ కేంద్రానికి భవనం లేక పోవడంతో రెవెన్యూ శాఖ ద్వారా సుమారు రూ. 5 లక్షల వ్యయంతో నూతనంగా భవనాన్ని నిర్మించారు. పోలింగ్‌కు అనువుగా ఉండేందుకు నిర్మాణాలు చేశారు. ఎత్తైన కొండపై ఉన్న ఈ గ్రామంలో పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎస్సై పలు రకాలుగా పరిశీలించారు.

తగ్గిన క్యాబేజీ ధర

కొత్తూరు: క్యాబేజీ పువ్వు ధరలు తగ్గాయి. సంక్రాంతి ముందువరకూ ఒక్కో పువ్వు 40 రూపాయలు పలకేది. అయితే ప్రస్తుతం మూడు పువ్వులను 50 రూపాయలకు విక్రయిస్తున్నారు. సంక్రాంతి పండుగ రోజుల్లో మాంసం ప్రియులు కూరగాయలను తినడం తగ్గించేశారు. దీంతో పంట మార్కెట్‌లో చెల్లిక పోవడంతో వ్యాన్లపై గ్రామాల్లోకి తీసుకొని వెళ్లి చౌకగా విక్రయిస్తున్నారు.